క్లుప్తంగా

చురుగ్గా బాస్కెట్‌బాల్ శిక్షణ


బాస్కెట్‌బాల్ శిక్షణ పొందుతున్న చిన్నారులు


సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాస్కెట్‌బాల్ శిక్షణ చురుగ్గా సాగుతోంది. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు విప్పర్తి కొండల రావు, కెనడీ, లింగం శివ తదితరులు సుమారు 80 మంది విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారులకు విశ్రాంత మిలిటరీ సభ్యుడు, సీనియర్ కోచ్ ఐ గోపాలకృష్ణ, సీనియర్ ఉపాధ్యాయుడు గిరిధర్ గోపాలరావు, చెక్కా శేషారావు, బొడ్డు సత్యనారాయణ శిక్షణ ఇస్తున్నారు.

వేకువ జామునే పింఛన్ల పంపిణీ


13వ సచివాలయ పరిధిలో లబ్ధిదారు లక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్రీదేవి

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీ సచివాలయ వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం తెల్లవారు జాము నుంచే ప్రారంభించారు. మండలంలోని 18 గ్రామాలు, మున్సిపాలిటీలోను 90 శాతం మొదటి రోజునే పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ


జె.రామారావు

సామర్లకోట: మున్సిపల్ కమిషనర్ సీఎంఎ నయీం అహ్మద్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలో భాగంగా ఆయన పొన్నూరుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సెక్రటరీ, శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జె.రామారావు పదోన్నతిపై కమిషనర్‌గా రానున్నారు. నయీం అహ్మద్ గత ఏడాది సెప్టెంబరు 7న కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణవేణి

పిఠాపురం: స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌రావు గురువారం బదిలీ అయ్యారు. ఈయన నరసరావుపేట మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. కాగా యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి ఇక్కడకు వచ్చారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



పెద్దాపురం: మండలంలోని చినబ్రహ్మదేవంలో అలివేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వర కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి లక్ష తులసి పూజ, రాత్రి దివ్య కల్యాణం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలు, చలువ పందిళ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో భాగస్వాములయ్యారు.

నేడు డీఆర్‌డీఏ ఏపీఎం, ఏసీలకు శిక్షణ

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి డీఆర్‌డీఏకు చెందిన జిల్లాలోని ఏపీఎంలు, ఏసీలు, సీసీలకు ఒక రోజు శిక్షణ ఉంటుందని డీఆర్‌డీఏ సూపర్‌వైజర్ వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌పై క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణకు జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని, దీనిని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలన్నారు.

మున్సిపల్ ఏఈకి రిమాండ్

పిఠాపురం: లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన పిఠాపురం మున్సిపల్ ఏఈ అభిషేక్ వంశీకి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఏఈని రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు అధికారులు తెలిపారు. కాంట్రాక్టర్ బుక్ ఆన్‌లైన్ చేయడానికి లంచం తీసుకుంటుండగా రెడ్‌హేండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు బుధవారం అర్ధరాత్రి వరకూ పిఠాపురంలో మున్సిపల్ కార్యాలయంలో ఏఈ గదితో పాటు ఆయన నివాసంలోను విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అదుపుతోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు.

నిధులున్నా నిర్లక్ష్యమేల?

- శిథిలమైన చెక్ డ్యాంలు, రెగ్యులేటర్లు
- ఎగువ ప్రాంతాలకు పారని సాగునీరు
- వర్షాలతో పల్లపు భూములకు ముంపు


వీకే రాయపురంలో శిథిలమైన రెగ్యులేటర్

సామర్లకోట: గోదావరి కాలువ అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు టెండర్లు పిలుస్తున్నా, రైతులకు ఏ మాత్రం ప్రయోజనం కనిపించడం లేదు. గోదావరి కాలువ నీరు పంట పొలాలకు అందజేయడానికి చెక్ డ్యాంలు, కాలువలు ఏర్పాటు చేశారు. ఆయా కాలువల నుంచి పంట కాలువల ద్వారా రైతుల పొలాలకు సాగు నీరు అందుతోంది. సామర్లకోట పట్టణ, మండల పరిధిలోని రైతులకు గోదావరి జలాలు సాగునీటిగా ఉపయోగపడుతున్నాయి. గోదావరి కాలువలో తరచూ గుర్రపుడెక్క పెరిగి పోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువ వెంబడి చెక్ డాంల నిర్మాణానికి నిధులు విడుదలవుతున్నా ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తుంటే టెండర్లు వేయడం లేదని చెప్తున్నారని రైతులు అంటున్నారు. ఎనిమిదేళ్లుగా వీకే రాయపురంలో ఉన్న రెగ్యులేటర్ శిథిలావస్థలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల పల్లపు భూములకు నీరు ఎక్కువగా ప్రవహించడంతో ఆ భూములు ముంపునకు గురయ్యాయని, రైతులు వాపోతున్నారు.

వీకే రాయపురం నుంచి రామేశ్వరం లో లెవెల్, దోనేటి కాలువలకు నీరు వెళ్తోంది. అయితే రెగ్యులేటర్ శిథిలం కావడంతో ఎగువ ప్రాంతాల భూములకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. రెగ్యులేటర్ మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయని మూడేళ్లుగా అధికారులు చెప్తున్నప్పటికీ పనులు మాత్రం చేయడం లేదని వారు అంటున్నారు.

ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం...



రెగ్యులేటర్ విషయంపై ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారితో కలసి రెగ్యులేటర్‌ను పరిశీలించా. త్వరలో పనులు చేపట్టేందుకు కృషి చేస్తాను.
–ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

చిత్రలేఖన పోటీల్లో భాగస్వాములవ్వండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిసున్న జేవీవీ నాయకులు

పెద్దాపురం: పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐదో తేదీన నిర్వహించే చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని జేవీవీ జిల్లా కన్వీనర్ బుద్ధా శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరంలో చిత్రలేఖన పోటీల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. క్యాంప్ కన్వీనర్ రొంగల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదో తేదీన సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు పోటీలు ఉంటాయన్నార. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగం, 6, 7 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగం, 3, 4, 5 తరగతి విద్యార్థులకు సబ్ జూనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. కలర్స్ విద్యార్థులే తెచ్చుకోవాలని, డ్రాయింగ్ షీట్స్ ఇక్కడ సమకూరుస్తామని తెలిపారు.

రేపు నేరెళ్లమ్మతల్లి జాతర

కొత్తపల్లి: గొర్స గ్రామదేవత మాదాలమ్మతల్లి జాతరను శనివారం రాత్రి నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. 4న తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు.

ఆర్థిక సాయం


వాకతిప్పలోమసకపల్లి చిన్నఅప్పన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న, మృతి చెందిన కుటుంబాలను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వాకతిప్పకు చెందిన ఇటీవల మృతి చెందిన మసకపల్లి చిన్నఅప్పన్న కుటుంబానికి రూ.5వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న కొత్తమూలపేటకు చెందిన కాటూరి నాగేశ్వరరావు, కాటూరి సూర్యప్రకాష్‌లకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, దాకే రాజ్‌కుమార్, వడ్డీ నాగమణి, ఎంపీటీసీల సుగుణ తదితరులు ఉన్నారు.

విషయ పరిజ్ఞానంతో ప్రశ్నాసామర్థ్యం

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మురళి


జెడ్పీటీసీలకు శిక్షణ ఇస్తున్న డైరెక్టర్ మురళి

సామర్లకోట: జెడ్పీటీసీ సభ్యుల విధులు, విధానాలపై స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో గురువారం నుంచి మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకుడు జె.మురళి జెడ్పీటీసీలకు జిల్లా పరిషత్ చేపట్టే వివిధ కార్యక్రమాల అమలుపై శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు మెటీరియల్‌ను అందజేయనున్నట్టు తెలిపారు. జిల్లా పరిషత్ అధికారాలు, కార్యక్రమాలు, ఆదాయ వనరులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఏ అంశంపైనైనా విషయ పరిజ్ఞానం ఉంటే అధికారులను ప్రశ్నించే వీలు ఉంటుందని వివరించారు. అధికారులతో ఏ విధంగా పనిచేయించుకోవాలో తెలుసుకోవాలన్నారు. జెడ్పీ సీఈఓ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకునేలా శిక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమానికి ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అధ్యక్షత వహించగా ఏపీఎస్ఐఆర్డీ జేడీ సి.రోసిరెడ్డి వరప్రసాద్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

'పోష్' కమిటీ సభ్యురాలిగా కృష్ణప్రియ


ఎంపీ వంగా గీతను మర్యాదపూర్వకంగా కలసిన కృష్ణప్రియ

కాకినాడ: మహిళలపై లైంగిక వేధింపుల నియంత్రణ కమిటీ (ప్రివెంటివ్ ఆఫ్ సెక్యువల్ హెరాస్‌మెంట్–పోష్) సభ్యురాలిగా బీర కృష్ణప్రియ నియమితులయ్యారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ)కి అనుబంధంగా పనిచేసే ఈ కమిటీకి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత చైర్‌పర్సన్‌గా, మరో ఆరుగురిని సభ్యులుగా నియమించారు. ప్రభుత్వేతర సంస్థల తరఫున ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సిఫార్సు మేరకు కల్పకం ఏచూరి మహిళా శక్తి సంఘం ప్రతినిధి కృష్ణప్రియకు అవకాశం కల్పించారు. బీటెక్ పట్టభద్రురాలైన కృష్ణప్రియ సుదీర్ఘకాలంగా మహిళల అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. కృష్ణప్రియ ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమెను కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ అభినందించారు.

కొత్తపల్లి మండలంలో 83.70 శాతం పింఛన్ల పంపిణీ


యండపల్లిలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలో గురువారం తెల్లవారు జాము నుంచే అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు గ్రామ వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండలంలో 12537 గాను 10493(83.70) పింఛన్లు అందజేసినట్టు ఎంపీడీఓ అబ్రహం లింకన్ తెలిపారు. నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

చంద్రబాబు జీవితం అబద్ధాలమయం

- ఉప్పాడలో గడప గడపకూ మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు


ఉప్పాడలో పెంఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మరోసారి మోసపూరిత మేనిఫెస్టోతో ప్రతి ఒక్కరినీ మోసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఉప్పాడలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లీ గత నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాల రూపంలో పొందిన లబ్ధిని వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహరెడ్డి ఒక పవిత్ర గ్రంథంలా భావించారని, భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి ఇచ్చిన ప్రతిమాటను నెరవేర్చారన్నారు. చంద్రబాబుకు అసలు మేనిఫెస్టో గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. 600 హామీల మేనిఫెస్టో ఇచ్చి ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన బాబుకు ప్రజలు గత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. అనంతరం ఉప్పాడలో జిల్లా పరిషత్ నిధులు రూ.10లక్షలతో చేపట్టబోయే కమ్యూనిటీ భవనానికి ఆయన శంఖుస్థాపన చేసారు. గ్రామ వలంటీర్లు గ్రామ సచివాలయ కర్వీనర్లు, గృహ సారధులతో కలిసి పింఛన్లను లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో కల్యాణ మండపం నిర్మాణం


సమావేశంలో మాట్లాడుతున్న బుర్రా అనుబాబు

పిఠాపురం: సమష్టి కృషితోనే కాపు కల్యాణ మండపం నిర్మాణం పూర్తవుతుందని పిఠాపురం కాపు ఐక్య వేదిక నాయకులు నిర్ణయించారు. పిఠాపురం ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం పిఠాపురం కాపు ఐక్య వేదిక అధ్యక్షుడు బుర్రా అనుబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కాపు నాయకులు మాట్లాడుతూ కాపు కల్యాణ మండపం నిర్మాణం చేపట్టే విధంగా నియోజకవర్గంలో కాపులందరూ సమమిష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలన్నారు. కాపు కల్యాణ మండపం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు అనుమతితో ఆయన ఇచ్చే నిధులతో ముందుకు వెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. త్వరలోనే ఎమ్మెల్యేను కలిసి కల్యాణ మండపం నిర్మాణంకు అన్ని చర్యలు తీసుకోడానికి కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం సీఐటీయూ నాయకులు కె చిన్న, డి.సత్యనారాయణ అధ్యక్షతన సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.శేషుబాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులపై తీవ్రమైన నిర్బంధాలు పెడుతున్నాయని అన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని అడుగుతుంటే వారిపై దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అనేక పోరాటాల చేసి ఆవిర్భవించిన సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సంఘటితంగా మరిన్ని పోరాటాలు చేయాలన్నారు. తద్వారా కార్మికుల న్యాయమైన హక్కులను సాదించికోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి వీరబాబు, కె.రమణ, టి.కిరణ్, డి.గోపాలకృష్ణ, రాంబాబు, ఎం.శ్రీను, మోరుకుర్తి సూరిబాబు, బి.అప్పారావు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ దుర్గాప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై వినయ్ ప్రతాప్

సామర్లకోట: ఇటీవలి కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. మండల పరిధిలో ఉండూరు గ్రామంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ లలితాకుమారి పర్యవేక్షణలో గ్రామ ప్రజలకు సచివాలయం వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, బ్యాంకు అకౌంట్, ఆధార్ నంబర్లు, వేలి ముద్రలు ఇతరులకు తెలియజేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలకు సంబంధించిన సమాచారంతో పాటు అనుమానాస్పందంగా తిరుగుతున్న వ్యక్తులకు సంబంధించి 100, 112లకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల సమస్యలకు సంబందించి దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సై గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

పిఠాపురం: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించడానికి శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని ఎస్సై వినయ్‌ప్రతాప్ సూచించారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో గురువారం సాయంత్రం ఆయన గ్రామస్తులతో కలిసి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఆ కమిటీ పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అనుకోకుండా ఏర్పడే చిన్న తగాదాలే పెద్ద సమస్యలకు దారి తీస్తాయని అటువంటి సమయాల్లో గ్రామస్తులు ఏకమై మాట్లాడుకుంటే వెంటనే ఆ సమస్య పరిష్కారమవుతుందని తద్వారా పెద్ద తగాదా రాకుండా ఆపవచ్చని ఆయన తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా దొంగతనాలు దోపిడీలు జరగకుండా నిరోధించడానికి గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, డింశెట్టి భాస్కరరెడ్డి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐసీయూలో అగ్నిప్రమాదం

- జీజీహెచ్‌లో ఏసీ నుంచి మంటలు
- ఊపిరాడక అవస్థలు పడ్డ రోగులు
- ఆగమేఘాలపై సురక్షిత వార్డులకు తరలించిన సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది


ప్రమాదం అనంతరం విద్యుత్ పునరుద్ధరించి వార్డును సిద్ధం చేయిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లోని ఎక్యూట్ మల్టీకేర్ యూనిట్ (ఏఎంసీయూ–1)లో గురువారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో ఏసీకి మంటలు వ్యాపించాయి. తక్షణమే స్పందించిన శానిటేషన్ సిబ్బంది విద్యుత్ మెయిన్ లైన్‌ను ఆఫ్ చేయడంతో మంటలు అక్కడికక్కడే నియంత్రణలోకి వచ్చాయి. ఆ మరుక్షణమే దట్టమైన పొగ ఐసీయూను కమ్మేసింది. రోగులకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, ఎంఎన్‌వోలు స్పందించిన తీరు అబ్బురపరిచింది. అందిన రోగిని అందినట్టు స్ట్రెచర్లు, చక్రాల కుర్చీలతో తరలించడంతో పాటు భుజాలపైకి ఎత్తుకుని సురక్షిత వార్డులకు పరుగులు పెట్టారు. వైద్యుల సూచనల మేరకు పలువురిని అత్యవసర విభాగానికి, కొందర్ని సీఐసీయూకి, మరికొందర్ని వెంటిలేటర్ సౌకర్యమున్న ఇతర ఐసీయూలకు క్షణాల్లో తరలించి ఏ ఒక్కరికీ హాని జరగకుండా కాపాడారు. 12 పడకలున్న ఏఎంసీయూ–1లో గురువారం సాయంత్రం 11 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వారిలో స్పృహలేని స్థితిలో చికిత్స పొందుతున్న వారూ ఉన్నారు. మంటలు, పొగ తీవ్రతకి వీరంతా ఒక్కసారిగా ఉక్కిబిక్కిరయ్యారు. పొగ కమ్మేసిన క్షణాల్లో ఆ చిమ్మ చీకట్లో ఎవరో ఇద్దరు వ్యక్తులు వచ్చి తనను భుజాలపైకి ఎత్తుకొని సీఐసీయూకి తీసుకొచ్చి చేర్చారనీ, మంటంలంటుకున్న ఏసీకి సమీపంలో ఉన్న పడకపై తాను కదల్లేని స్థితిలో ఉన్నానంటూ ఓ మహిళ భయాందోళన వ్యక్తం చేసింది. తనను తీసుకొచ్చినవారి ముఖాలైనా చూడలేదని సిబ్బంది స్పందించిన తీరును భావోద్వేగంతో వెల్లడించింది. ప్రమాద ఘటనకు కారణం షార్ట్ సర్క్యూటేనని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని అన్నారు. మంటలంటుకున్న వార్డులో మరమ్మతులు జరుగుతున్నాయని శుక్రవారం ఉదయానికి వార్డు సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు. ఏసీ వైరింగ్ మాత్రమే కాలిందనీ, ఏసీ సహా వార్డులో ఉన్న వెంటిలేటర్లు, ఇతర పరికరాలేవీ కాలలేదని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ అన్నారు. వారితో పాటు డాక్టర్ వెంకటరెడ్డి ప్రమాదం వేళ తక్షణమే స్పందించి రోగులను కాపాడిన సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది, ఎంఎన్‌ఓలను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్లలో చెట్టు కొమ్మల తొలగిస్తున్నందున శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సనఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలోని నాగులపల్లి, రమణక్కపేట, నాగులపల్లి ఉప్పరగూడెం గ్రామాలతోపాటు నాగులపల్లి చెరువులకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.